క్లుప్తంగా

వెండి అభయహస్తం బహూకరణ



విజయదుర్గమ్మ ఆలయానికి వెండి అభయహస్తం బహూకరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పంచముఖ మరకత లింగేశ్వర సమన్విత శ్రీచక్ర సహిత విజయదుర్గ అమ్మవారికి పట్టణానికి చెందిన వంకదారి లీలా వెంకట బాల సత్యనారాయణ అరకిలో బరువు గల వెండి అభయహస్తమును అందజేసినట్లు ఆలయ శాశ్వత కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామమోహన్‌రావు తెలిపారు. దాత సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు వేద ఆశీరర్వచం, అమ్మవారి శేష వస్త్రాలతో సత్కరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చిట్లూరి కిరణ్ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయవాది కిషోర్‌కుమార్ మృతికి సంతాపం



సింహాద్రి కిషోర్‌కుమార్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది సింహాద్రి కిషోర్‌కుమార్ శనివారం గుండెపోటుతో మరణించారు. కిషోర్ కుమార్ మృతికి జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ తీవ్ర సంతాపం తెలియజేసింది. కిషోర్ భౌతిక కాయాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తల్లాడి అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏవీవీ భువనేశ్వరి, న్యాయవాదులు సందర్శించి నివాళులు అర్పించారు.

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంక్రాంతి యువజన ఉత్సవాలు



పాత చింతలపూడిలో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

చింతలపూడి: పాత చింతలపూడిలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం యువజన ఉత్సవాలను ప్రారంభించారు. ఏఐవైఎఫ్ జిల్లా కోకన్వీనర్ తొర్లపాటి రాజు మాట్లాడుతూ సంక్రాంతి మూడు రోజులు ముగ్గుల పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తొర్లపాటి బాబు, ఎం ఇమ్మానియేలు, బోడా నాగభూషణం, పి పరదేశి, బడా ఏసు, గట్టు ప్రభు, బాబ్జి, ఎం.లాజరు పాల్గొన్నారు.


శ్రీవారి సేవలో...



ఏపీపీసీబీ మెంబర్ సెక్రటరీకి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఏపీపీసీబీ మెంబర్ సెక్రటరీ బి.శ్రీధర్ శనివారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

అట్టహాసంగా శ్రీవారి తిరువీధి సేవ



దేవేరులు, గోదాదేవితో ఊరేగుతున్న శ్రీవారు


ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా నిత్యం చినవెంకన్న ఉభయ దేవేరులు, గోదాదేవితో క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్నారు. శనివారం నిర్వహించిన తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ, అశ్వ సేవల నడుమ గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు.

పందెం సాగేనా..?

- కోడి పందేలు వద్దని హైకోర్టు ఆదేశం
- ఎక్కడికక్కడ పోలీసుల నిఘా
- పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- అనుమతుల కోసం నిర్వాహకుల ప్రయత్నాలు
- పందెంరాయుళ్లలో ఉత్కంఠ



లింగపాలెం మండలంలోని ఓ తోటలో పందెం కోళ్లను పెంచుతున్న దృశ్యం



తలపడుతున్న పుంజులు



కోడిపుంజుకు బాదంపిస్తా, చోళ్లు, గంట్లు, వేటమాసం ఆహారంగా పెడుతున్న దృశ్యం



ప్రత్యేక చెరువులో ఈత కొడుతున్న పుంజు

లింగపాలెం: సంక్రాంతి పండుగ అంటే.. అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలు, హరిదాసులు భోగి మంటలు, పిండివంటలు, కొత్త అల్లుళ్ల కోలాహలతోపాటు కోడి పందేలు సైతం సర్వసాధారమైపోయింది. ఏటా సంక్రాంతికి పెద్దెత్తున కోడి పందేలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. దీంతో పలుచోట్ల కోడిపందేలు నిర్వహించేందుకు పందెగాళ్లు సిద్ధమవుతుంటారు. జూద క్రీడలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించడం.. చివరికి పండుగ మూడు రోజుల నిర్వాహకులు, పెద్దల వత్తిళ్లతో ఆఖరికి చేతులెత్తయడంతో కోడిపందేలు యథేచ్ఛగా సాగుతుంటాయి. ఈ పందేలతో ఏటా కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. అయితే ఈసారి కోడిపందేల నిర్వహణకు హైకోర్టు నిషేధాజ్ఞలు విధించడంతో పందెగాళ్లలో అయోమయం నెలకొంది. పోలీసులు సైతం 144 సెక్షన్ అమలు చేస్తూ కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తుండడంతో కోడిపందేలు జరుగుతాయా. లేదా అని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

మెట్ట ప్రాంతానికి పాకిన కోడిపందేలు..

ఒకప్పుడు డెల్టాప్రాంతంలోనే ఎక్కువగా కోడిపందేలు నిర్వహించేవారు. కానీ నేడు మెట్ట ప్రాంతాల్లో కూడా కోడిపందేలు జోరుగా సాగుతున్నాయి. కేవలం కొందరు సంక్రాంతి పండుగకు పందేలు నిర్వహించడం కోసం వేలాదిరూపాయిలతో కోడిపుంజులు కొనుగోలుచేసి పందెంపుంజులను మేపుతున్నారు. ఈ పుంజులను కొత్త అల్లుళ్లను చూసినంత ఆప్యాయంగా పెంచుతున్నారు. కోళ్లను ఉదయాన్నే నీళ్లలో ఈత కొట్టించడం. వేడినీళ్లస్నానం, బాదం పిస్తాపప్పులు, కోడిగుడ్లు, వేటమాంసం, మినరల్ వాటర్ ఇలా వాటికి ఎంతో శ్రేష్ఠమైన బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తూ పందేనికి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే లింగపాలెం మండలంలో పెద్ద సంఖ్యలో పందెంకోళ్లు సిద్ధంగా ఉన్నాయి. ఒకొక్క పుంజును రూ 20 వేల నుంచి రూ.45 వేల వరకు కొనుగోలు, విక్రయాలు చేస్తున్నారు, డేగ, కాకిడేగ, సీతువ, నెమలి, పెట్టమారి, పచ్చకాకి, కెక్కిరాయి, నెమలిడేగ రకాల కోళ్లకు మంచి గిరాకీ ఉంటుంది. పందెం సమయంలో కోడి పుంజులు అలుపుతో పడిపోకుండా ఉండేందుకు వాటికి రకరకాల విన్యాసాలు చేయిస్తారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శిబిరంలో ఆయాసం వచ్చినా తట్టుకునే విధంగా ఉండటానికి ఉరికిస్తున్నారు. ఒక్కో కోడికి నెలకు రూ 3,500 వరకూ ఖర్చు చేస్తున్నారు. లింగపాలెం మండలంలో నిర్వహించే కోడిపందేలకు మండల ప్రజలతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందినవారు ఇతర జిల్లాల నుంచి పందేలరాయుళ్లు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. ఈప్రాంతానికి చెందిన వారే అధిక సంఖ్యలో హైదరాబాద్, బెంగుళూరు, కర్ణాటక తదితర రాష్ట్రాలలో స్థిరపడడంతో, వారు సంక్రాంతి పండుగకు ఇక్కడకు వచ్చి పండుగ మూడు రోజుల పాటు ఆనందంగా గడిపి వెళుతుంటారు. మండలంలోని 4 నుంచి 5 ప్రదేశాల్లో పందెలు వేసేందుకు పందేలరాయుళ్లు అన్ని ఏర్పాట్లతో పందెంబిరులను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ భారీ ఎత్తున లక్షల రూపాయిల్లో పందేలు వేసేందుకు దూరప్రాంతాల నుంచి అనేక మందితో ఎవ్వరికి వారే ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇక్కడ జోడి పందేలు వేసేందుకు ఇతర జిల్లాలకు చెందిన పందెంరాయుళ్లతో బ్యాచీలుగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఒకొక్క పందెం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరగనున్నట్లు సమాచారం.

కోడి పందేలకు పోలీసులు నై

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో సంక్రాంతి కోడి పందేలకు పోలీసులు అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని ఖచ్చితంగా చెబుతుండడంతో పందెంరాయుళ్లు అయోమయానికి గురవుతున్నారు. సంక్రాంతి కోడి పందేలను నిలుపుదల చేస్తామని ఏటా పోలీసులు ప్రకటనలు చేయడం.. చివరకు రాజకీయ నేతల వత్తిళ్లతో పండుగ మూడు రోజులు పందేలను చూసి చూడనట్లు వదిలి వేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి మాత్రం హైకోర్టు కోడిపందేలను జరపడానికి వీల్లేదని చెప్పడంతో పందెంరాయుళ్లకు పాలుపోవడం లేదు. మెట్టప్రాంతమైన చింతలపూడి నియోజకవర్గంలోని చింతలపూడి, సీతానగరం, రాఘవాపురం, లింగపాలెం మండలం కొణిజర్ల, ములగలంపాడు, కామవరపుకోట మండలం కళ్ళచెర్వు, రావికంపాడు, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, లక్కవరం తదితర గ్రామాల్లో పెద్ద పందేలను నిర్వహించేవారు. కోడి పందేలకు తోడు గుండాట, కోసాట వంటి జూద క్రీడలు కూడా భారీ ఎత్తున విచ్చలవిడిగా నిర్వహించేవారు. సంక్రాంతి వేడుకల్లో కోడి పందేలకు అధిక ప్రాధాన్యత ఉండటం, ప్రభుత్వంలోని పెద్దల ఆదేశాలతో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించక తప్పేది కాదు. కోట్లాది రూపాయలు చేతులు మారే ఈ జూద క్రీడలో డెల్టా ఏరియాకు దీటుగా మెట్టలో కూడా కోడి పందేలను నిర్వహించడానికి రాజకీయ నాయకులపై నిర్వాహకులు వత్తిడి చేసినట్లు సమాచారం.

ఎంపీ శ్రీధర్‌ను కలిసిన కంభం విజయరాజు



గన్నవరంలో ఎంపీ శ్రీధర్‌ను కలిసిన చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త విజయరాజు

దెందులూరు: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త కంభం విజయరాజు శనివారం కలిశారు. చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా ఎంపిక చేయడంపై ఆయన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు చింతలపూడి ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, చింతలపూడి జెడ్పీటీసీ నీరజ, లింగపాలెం మండల పార్టీ అధ్యక్షుడు కొఠారు మోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నపనేని రాజశేఖర్, మల్లిబాబు ఉన్నారు.

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు



పారిజాతగిరి ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా స్థానిక పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదారంగనాథుడు తిరుప్పావై ప్రవచనం ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి వారికి ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్ఠి, ప్రసాదవితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. దాతలు పరిమి గంగరాజు, పరిమి ధర్మరాజు భక్తులకు అన్నదానం చేశారు. దాతల కుటుంబ సభ్యులను శ్రీస్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి వేద పండితుల ఆశీస్సులతో సన్మానించారు. భోగి పండుగ సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి శ్రీగోదారంగనాథుని కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు.

కొయ్యలగూడెంలో 144 సెక్షన్ అమలు



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమణి

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండల వ్యాప్తంగా ఈనెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు మండల మేజిస్ట్రేట్, తహసీల్దార్ పాసం నాగమణి పేర్కొన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంక్రాంతి మాటున జూద క్రీడల నిర్వహణపై ఉక్కుపాదం మోపాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పేకాట, గుండాట జూద క్రీడలతోపాటు కోడిపందేలపై పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు నిర్వహించకుండా ప్రజలు కూడా సహకరించాలని తెలిపారు.

చెస్ పోటీలు ప్రారంభం

ఏలూరు (టూటౌన్): సంక్రాంతి పండుగ వంటి సందర్భంలో యువత చెడు వ్యసనాల వైపు మరలకుండా తెలుగు సంస్కృతి కాపాడే విధంగా అందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఏలూరు తహసీల్దార్ పి.సోమశేఖర్ పిలుపు ఇచ్చారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏలూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సభకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వి.ఠాగూర్ రాజా అధ్యక్షత వహించారు. తహసీల్దార్ సోమశేఖర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ తదితరులు మాట్లాడారు. సీఐటీయూ నాయకులు ఆర్బిటర్ డి.లక్ష్మణరావు, కృష్ణవేణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మహిళ

కామవరపుకోట: ద్విచక్ర వాహనం అదుపుతప్పి శనివారం ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఓ మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంపై ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళుతుండగా, రావికంపాడు శివారు రోడ్డుపక్కన ఉన్న ఓ టీస్టాల్ సమీపానికి వచ్చేసరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆమెను జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చింతలపూడి గెలుపును సీఎం జగన్‌కు కానుకగా ఇవ్వాలి



ఎంపీ మిధున్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం: వచ్చే ఎన్నికల్లో విజయదుందుభి మోగించి చింతలపూడి నియోజకవర్గ గెలుపును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిధున్ రెడ్డి అన్నారు. విజయవాడలోని ఆయన నివాసంలో చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన కంభం విజయరాజు శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తనను చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మిధున్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి అన్ని వర్గాల వారిని కలుపుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, పామర్రు నియోజకవర్గం పరిశీలకులు మండవల్లి విజయసారథి, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల కోఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, చింతలపూడి జెడ్పీటీసీ నీరజ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి, లింగపాలెం మండల అధ్యక్షుడు కొఠారి మోహన్‌రావు, జంగారెడ్డిగూడెం వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, కనికెళ్ల ప్రసాద్, తానిగడప రామకృష్ణ, కేమిశెట్టి మల్లిబాబు, ఏవీ రమణమూర్తి, కంచర్ల విష్ణు తదితరులు ఉన్నారు. అలాగే కంభం విజయరాజు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను గన్నవరం ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన నియామకంపై కృతజ్ఞతలు తెలిపారు.

పోలవరంలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్



ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మిలను శనివారం జంగారెడ్డిగూడెంలోని బాలరాజు నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మిలను శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి సన్మానించారు. అదేవిధంగా ఎంపీ శ్రీధర్‌ను కూడా ఎమ్మెల్యే దంపతులు సత్కరించారు. అనంతరం ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని అన్నారు. అందరూ సమన్వయంతో ఉంటూ పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. అలాగే బాలరాజు కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడచిన ఐదేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీ గెలుపునకు దోహదపడతాయని అన్నారు. అలాగే ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి దేశానికే గర్వకారణంగా నిలవాలి



విజేతలతో ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, పీవీ సునీల్ కుమార్

చింతలపూడి: యువత క్రీడల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. సంక్రాంతి పండగ సందర్భంగా అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఎయిమ్) ఆధ్వర్యంలో గ్రేస్ గార్డెన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్నాయని అన్నారు. క్రీడల్లో సత్తా చాటడానికి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని క్రీడాకారులు వేదికలా ఉపయోగించుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో అద్భుతమైన ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నారని, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ఎక్కువగా గ్రామీణ యువత ప్రతిభ కనపరుస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా యువత చెడు మార్గాలు పట్టకుండా క్రీడల్లో పాల్గొనాలన్న ఉద్దేశంతో పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఫైర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీజీపీ పీవీ సునీల్ కుమార్ అన్నారు. అనంతరం క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.విజయరాజు, జెడ్పీటీసీ ఎం.నీరజ, మండల పరిషత్ అధ్యక్షుడు బి.రాంబాబు నాయక్, ఎయిమ్ జిల్లా నాయకులు కాకర్ల సత్యన్నారాయణ, ఎంఎస్ రాజేంద్ర, బుచ్చిబాబు, గంధం చంటి, ఆర్‌పీ రామారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చింతలపూడిలో కలుసుకున్న 1998-99 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చింతలపూడి: సంక్రాంతి పండుగ సందర్భంగా చింతలపూడి బాలుర ఉన్నత పాఠశాల 1998–99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం స్థానిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదివిన ఆనాటి రోజులను నెమరు వేసుకున్నారు. మిత్రులంతా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాడు గురువులు చెప్పిన చదువు వల్లే తామంతా మంచి స్థితిలో ఉన్నామని గుర్తుచేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను చెప్పుకుంటూ సహపంక్తి భోజనాలు చేశారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. సుమారు 100 మంది పూర్వ విద్యార్థులు కార్యక్రమానికి హాజరయ్యారు.

అలరించిన ప్రదర్శనలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలిలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన సంగీత, సాహిత్య, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. శనివారం ఉదయం విశాఖపట్టణానికి చెందిన చిన్నారి బీ.శ్రీ లాస్య ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు అలరించాయి. సభకు సత్యవాణి అధ్యక్షత వహించగా తెలుగు రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, హేలాపురి కళాకారుల సంఘ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రాంతంలో అభివృద్ధి వేగవంతం

ఏలూరు రూరల్: ప్రభుత్వ కృషితో కొల్లేరు ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక వద్ద కొల్లేరు రిసార్ట్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరుకు పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం అటవీ శాఖ ద్వారా లక్షలాది రూపాయలు వెచ్చించి, పక్షుల విడిది కేంద్రం అభివృద్ధి చేసిందన్నారు. ఇదే క్రమంలో పర్యాటకులకు విడిది కోసం ప్రభుత్వం నిర్మించిన రిసార్ట్స్ పునఃప్రారంభమయ్యిందన్నారు. పండుగ వేళ అనేక ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కొల్లేరు గ్రామాల ప్రజలు సైతం సాదరంగా ఆహ్వానం పలుకుతున్నారని వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మంచెం మైబాబు, బొద్దాని శ్రీనివాస్‌తో పాటు జయమంగళ రామారావు, ముంగర తిమోతీ, మండల కొండలరావు, బలే బలరామయ్య, రుక్మనంద్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు సమైక్యతను చాటుతాయి



ముగ్గుల పోటీలలో బహుమతులు అందుకున్న విజేతలు

కొయ్యలగూడెం: సంప్రదాయకరమైన ముగ్గులు పోటీలు సమైక్యతను చాటుతాయని జెడ్పీటీసీ దాసరి శ్రీ లక్ష్మీ పేర్కొన్నారు. శనివారం బయ్యనగూడెంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ నేత స్వర్గీయ పోతన శేషగిరిరావు జ్ఞాపకార్థం నిర్వహించిన ముగ్గుల పోటీలలో జెడ్పీటీసీ శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న 65 మందికి ప్రోత్సాహక బహుమతులతో పాటు రూ.25 వేల విలువైన బహుమతులను, కన్సోలేషన్ బహుమతులను విజేతలకు అందజేశారు. డాక్టర్ పోతన దుండి రాజాగణేష్ రాయుడు, డాక్టర్ పోతన లక్ష్మి, మంగ ప్రియాంకల సౌజన్యంతో ఈ పోటీలను నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, సర్పంచ్ లింగిసెట్టి అనంతలక్ష్మి, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, ఆరేటి ఏసుబాబు, కోరుకొండ విగ్నేష్, జొన్నకూటి పట్టియ్య తదితరులు పాల్గొన్నారు.